సాక్షి
వరంగల్
సోమవారం । 22 । జూలై । 2024



గంజాయి విక్రేత అరెస్ట్

వరంగల్‌లోని వెంకట్రామ జంక్షన్ వద్ద గంజాయితో వెళ్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. - 8లో ▸



ప్రవాహం..

- 8లో ▸

మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది కాళేశ్వరం వద్ద పరవళ్లు తొక్కుతోంది. కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద 9.800 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

గరిష్టం/కనిష్టం
31⁰ /26⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

నియామకం

రాయపర్తి: తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఎండీ యాసిఫ్ నియామకమయ్యారు. రాయపర్తి మండలకేంద్రానికి చెందిన ఆయన గత కొన్నేళ్లుగా వెయిట్ లిఫ్టింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి పలువురిని ప్రోత్సహించారు. ఆదివారం తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శృతికుమారి నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరమన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌తో శారీరక దారుఢ్యం పెంపొందించుకోవడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ఇబ్బంది ఉండొద్దు..

కాళోజీ సెంటర్ : వర్షాకాలంలో వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డీటీడీఓ సౌజన్య హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూఓలను ఆదేశించారు. ఆదివారం జూమ్ మీటింగ్ ద్వారా హాస్టళ్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ శిథిలమైన గదులు, లీకేజీ గదుల్లో విద్యార్థులు లేకుండా చేసుకోవాలని, ఫుడ్ పాయిజనింగ్ సమస్యలు లేకుండా వేడి ఆహారం వడ్డించాలని చెప్పారు. ఆహారం పరిశుభ్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల, వసతి గృహం ఆవరణంలో నీరు నిల్వలేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే తెలియచేయడానికి ఐటీడీఏ అత్యవసర కంట్రోల్ నంబర్‌లను సంప్రదించాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు డీడీ లేదా డీటీడీఓ ఆమోదం లేకుండా హెచ్‌ఎంలు, హెచ్‌డబ్ల్యూఓ లు ఎటువంటి సెలవులు తీసుకోవద్దని తెలిపారు.

ఎంపీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు 24

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ రెండో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 24 వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 27వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అన్ని పేపర్లకు రూ.950, బ్యాక్‌లాగ్స్ రెండు పేపర్ల వరకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ ప్రతి పేపర్‌కు రూ.300 ఫీజు చెల్లించాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో చూడవచ్చని సూచించారు.

పుస్తకావిష్కరణ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ చక్రవర్తుల రాధాకృష్ణారావు సాహితీ వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ మడత భాస్కర్ సంపాదకత్వంలో వెలువడిన నాకు నచ్చిన గురువు వ్యాససంకలనం పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్‌మోహన్ స్మారక భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కవి అందెశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా రచయిత మడత భాస్కర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆకెళ్ల రాఘవేంద్ర, సాహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, కవులు ఆచార్య బన్న అయిలయ్య, పంతంగి వెంకటేశ్వర్లు, డాక్టర్ సీతారాం, వందేమాతరం రవీంద్ర, చక్రవర్తుల మధు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

విద్యారణ్యపురి: ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన డీటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఈడీ, బీఈడీ విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన పదోన్నతి తర్వాత మిగిలిపోయిన పోస్టుల్లోనూ పదోన్నతి కల్పించేందుకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపక జ్వాల సంపాదకుడు డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ సీఎం హామీ ఇచ్చిన విధంగా ప్రతి పాఠశాలకు స్వచ్ఛ కార్మికులను వెంటనే నియమించాలన్నారు. విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కెభారతి, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం మాట్లాడారు. సుభాషిణి, సంజీవరెడ్డి, ఉప్పలయ్య, సారంగపాణి, రవికుమార్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యవతి, మల్లయ్య పాల్గొన్నారు.

తేలికపాటి వానలే..!

మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు

- చిరుజల్లుల నుంచి మోస్తరుగా కురుస్తున్న వానలు
- చెరువుల్లోకి చేరని నీరు
- జలాశయాలు పూర్తిస్థాయిలో నిండితేనే భరోసా
- ముసురుతో పత్తి చేలల్లో నిలుస్తున్న నీరు



చెన్నారావుపేటలోని కోపాకుల చెరువులోకి చేరిన నీరు



నెక్కొండ: మత్తడి పోస్తున్న ముదిగొండ శివారు సీతారాంపురం మాటు

సాక్షి, వరంగల్ : జిల్లా వ్యాప్తంగా మూడురోజులుగా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. జూన్ నెలలో ఆశించినమేర వానలు కురవకపోవడంతో నీళ్లు లేక ఎడారిలా తలపించిన జలాశయాల్లోకి ఇప్పుడిప్పుడే నీరుచేరుతోంది. దీంతో వరిసాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. అయితే ప్రస్తుతం చిరుజల్లులు మాత్రమే పడుతోండడంతో భారీ వర్షాలు కురిస్తేనే పంటలకు మేలని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ వానతో మెట్ట పంటలైన పత్తి, మొక్కజొన్న చేలల్లో కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. అదే సమయంలో వాననీరు నిలిచి ఉండడంతో పంటల వేర్లు దెబ్బతిని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఇదిలా ఉండగా.. ఈ వర్షాలతో జిల్లాలోని 816 చెరువులకు కాస్తా జలకళ వచ్చిందని నీటిపారుదల విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

నర్సంపేట మండలంలో ఉన్న 69 చెరువులు, కుంటల్లో ఇప్పుడిప్పుడే నీరు వచ్చి చేరుతోంది. ఇవన్నీ నిండితే 7,200 ఎకరాల్లో వరి సాగు కు ఢోకా ఉండదని అన్నదాతలు అంటున్నారు. మండలంలో అతిపెద్దదైన మాదన్నపేట చెరువు పూర్తి సామర్థ్యం 17అడుగులు కాగా.. 9.2ఫీట్ల నీరువచ్చి చేరింది. ఈ చెరువు ఆయకట్టు 2,800 ఎకరాలు ఉంటుంది.

చెన్నారావుపేట మండల పరిధిలోని ఎనిమిది పెద్ద చెరువులు, 37 చిన్ననీటి కుంటల్లోకి ఇప్పుడిప్పుడే నీరు చేరుతుంది. చెరువులు, కుంటలు అన్ని నిండితే 7,200 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. దుగ్గొండి మండల పరిధిలోని 14పెద్ద చెరువులు, 90 చిన్న నీటి కుంటల్లోకి ఇప్పుడిప్పుడే నీరు చేరుతోంది. ఇవన్నీ నిండితే నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు కానుంది. నల్లబెల్లి మండలంలోని 84 చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతుంది. రంగయ్య చెరువు ఆయకట్టు పరిధిలో 1600 ఎకరాలు సాగు అవుతుంది. వర్షాలతో పత్తి పంటలకు జీవం పోసినట్లైంది.

నెక్కొండ మండలంలోని 81చెరువులు, కుంటలోకి నీరు చేరుతోంది. వీటిలో 19 చెరువుల ఆయకట్టు కింద వందల ఎకరాలు వరి సాగు అవుతోంది. సీతారాంపురం మాటు మత్తడి పోస్తోంది. ఈ మాటు నుంచి వచ్చే నీరు వట్టే వాగులో కలుస్తుంది. ప్రధాన నీటి ఆయకట్టు వట్టే వాగు పరి ధిలో సుమారు 1,500 ఎకరాల సాగు అవుతుంది. వరుసగా కురుస్తున్న వర్షాలతో వరికి మేలు జరుగనుంది. కాగా, మరో రెండు మూడు రోజులు ఇలానే వర్షాలు కురిస్తే పత్తి చేల్లో నీళ్లు నిలిచి జాలు పట్టే ప్రమాదం ఉందని, దీంతో పత్తి చేను వేర్లు దెబ్బతిని నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్ధన్నపేట మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్నా.. చిరుజల్లులకు చెరువుల్లో కుంటల్లో పెద్దగా నీరు చేరుకోలేదు. చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలు కలిపి 50కిపైగా ఉన్నాయి. వీటిలో ప్రధానమైన కోనారెడ్డి చెరువు, ఇల్లంద, నల్లబెల్లి, ఉప్పరపల్లి, దమ్మన్నపేట, చెన్నారం, ల్యాబర్తి చెరువుల్లోనూ నీరు ఆశించినంత లేకపోవడంతో రైతులు సాగు పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ముఖ్యంగా వరి సాగు చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట పంటలకు కొంత మెరుగ్గా ఉండడంతో రైతులు పత్తి, మొక్కజొన్న ఇతర పంటలను సాగు చేస్తున్న పరిస్థితి ఉంది.

పర్వతగిరి మండలంలో చెరువులు, కుంటలు కలిపి 66 ఉన్నా ఆశించినంత మేర నీటి నిల్వ లేదు. వందల ఎకరాల సాగుకు అలవాలంగా ఉన్న పర్వతగిరి, ఏనుగల్లు, చింతనెక్కొండ, కొంకాపేట, వడ్లకొండ చెరువుల్లోనూ పూర్తిస్థాయిలో నీరు చేరక రైతులు ఎదురుచూస్తున్నారు.

జూలై నెలఖారుకొచ్చినా **సంగెం మండలంలో** ఉన్న 70 చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. 960ఎకరాల ఆయకట్టు కలిగిన ఎల్గూర్ రంగంపేట అతి పెద్ద చెరువులోకి ఇప్పుడిప్పుడే వాననీరు చేరుతోంది. కాపులకనపర్తి, చింతలపల్లి, నల్లబెల్లి, సంగెం, వెంకటాపూర్ తదితర చెరువుల కింద ఆయకట్టు 200నుంచి 250 ఎకరాలకు పైగా ఉంది. మండలంలో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు కుంటలోకి నీరు చేరలేదు. దీంతో సంగెం, కుంటపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల కింద రైతులు వరి నారు కూడా పోయలేదు. అలాగే గీసుకొండ మండలంలోని 76 చెరువుల్లో ఆశించినంత నీరు నిల్వ లేదు. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తుండడంతో నీరు వచ్చి చేరుతోంది. వీటిలో వందల ఎకరాల్లో సాగు ఉన్న 11 చెరువుల్లో 30 శాతం నీరు నిల్వ కూడా లేదు. ఫలితంగా వరి నాట్లు ఇంకా ఆలస్యం అవుతున్నాయి. కొందరు ఇప్పుడిప్పుడే వరి నాట్లు వేస్తుండడం కనిపిస్తోంది.

రాయపర్తి మండలంలో 92 చెరువులు, కుంటలున్నా నీటి నిల్వ లేక అన్నదాత ఇబ్బంది పడుతున్నాడు. మండల కేంద్రంలోని రామచంద్రుని చెరువు కింద 350 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఆ తర్వాత కాట్రపల్లి, తీర్మాలాయపల్లి, కొండూరు, మొరిపిరాల, సన్నూరు, కొత్తూరు, పెర్కవేడు, రాగన్న గూడెం, ఊకల్ తదితర చెరువుల కింద ఆయకట్టు 200 నుంచి 250 ఎకరాలకు పైగా ఉంటుంది. మండలంలో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలోకి నీరు చేరలేదు. దీంతో కాట్రపల్లి, ఊకల్ తదితర గ్రామాల్లోని చెరువుల కింద వరి నారు కూడా పోయలేదు. అయితే మూడురోజులుగా కురుస్తున్న ముసురుకు పత్తి, మొక్కజొన్న పంట చేలల్లో కలుపు అధికంగా ఉండడంతోపాటు మొక్కలు జాలువారి ఎర్రబారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తేనే చెరువులు కుంటల్లోకి నీరు చేరే అవకాశం ఉందంటున్నారు.

> **ఖానాపురం మండలంలో** 26 చెరువులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా అశోక్ నగర్‌లోని దూసముద్రం కింద 500 ఎకరాలు బుధరావుపేటలోని పెద్దాయ చెరువు, ఈదుల చెరువు కింద మరో 300 ఎకరాలు సాగు అవుతుంది. అలాగే ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు కింద 29,500ఎకరాలు సాగు అవుతుంది. సరస్సు నీటిమట్టం సామర్థ్యం 30.3అడుగులు కాగా.. 21.9అడుగులకు చేరింది. సరస్సు పరిధిలో నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం మండలాలకు చెందిన రైతుల సాగు భూములు ఉండగా.. వరి పంట సాగు చేస్తున్నారు.



నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువులో 9.6 అడుగులకు చేరిన నీటిమట్టం

ఆదివారం జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
దుగ్గొండి	34.3
నల్లబెల్లి	33.8
ఖానాపురం	32.8
ఖిలా వరంగల్	30.8
గీసుకొండ	29.7
చెన్నారావుపేట	27.5
వరంగల్	25.9
వర్ధన్నపేట	23.8
నెక్కొండ	21.6
నర్సంపేట	20.3
సంగెం	17.0
పర్వతగిరి	16.2
రాయపర్తి	14.8

భారీ వర్షం కురవాలి



మూడు రోజులుగా ముసురు వర్షం కురుస్తుంది. భారీ వర్షం లేకపోవడంతో చెరువులు నిండలేదు. భారీ వర్షం కురిస్తేనే చెరువులు నిండి పంటలు పండుతాయి. పెద్దవాన కోసం ఎదురు చేస్తున్నాం.

- హంస వీరస్వామి, ఆయకట్టు రైతు

విద్యుత్ సమస్యలుంటే ఫోన్ చేయండి

- ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు

వరంగల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ సమస్యలు ఏర్పడితే తమ సిబ్బంది, అధికారులను సంప్రదించాలని ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్, సిబ్బందిని లేదా వరంగల్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1912, 1800 425 0028లను సంప్రదించాలని మధుసూదన్‌రావు పేర్కొన్నారు.

మండలాల వారీగా ఎన్పీడీసీఎల్ ఏఈల మొబైల్ నంబర్లు


మండలం	సబ్‌స్టేషన్	ఫోన్ నంబర్
గీసుకొండ	మచ్చాపూర్	94408 11356
	గొర్రెకుంట	94408 11353
వర్ధన్నపేట	వర్ధన్నపేట	94408 11360
రాయపర్తి	రాయపర్తి	79016 78235
	మైలారం	94408 11362
పర్వతగిరి	పర్వతగిరి	94408 11363
	ఏనుగల్లు	99893 24924
నర్సంపేట	నర్సంపేట టౌన్	94408 11369
	నర్సంపేటరూరల్	94910 58649
దుగ్గొండి	దుగ్గొండి	94408 11371
	గిర్నిబాయి	94403 65675
నల్లబెల్లి	నల్లబెల్లి	94408 11372
ఖానాపురం	ఖానాపురం	94408 14852
నెక్కొండ	నెక్కొండ	94408 11373
చెన్నారావుపేట	చెన్నారావుపేట	94408 11374
ఖిలావరంగల్	ఫోర్ట్‌రోడ్	79016 28356
	మామునూరు	94408 11355
	కరీమాబాద్	94408 11351
	శంభునిపేట	83339 23910
వరంగల్	ఏజేమిల్	94408 11352
	స్టేషన్‌రోడ్	94408 11350
	మట్టెవాడ	94408 11349
	దేశాయిపేట	94910 58647
	పోచమ్మమైదాన్	94408 11348
	ఆరెపల్లి	79016 28355

కేఎంసీలో అధ్యాపకుల కొరత

ఎంజీఎం: వైద్యుల బదిలీతో కేఎంసీలో అధ్యాపకుల కొరత ఏర్పడింది. మెడిసిన్, సర్జరీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లోని సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు బదిలీపై ములుగు, నర్సంపేట, భూపాలపల్లి, జనగామ వైద్య కళాశాలలకు వెళ్లారు. దీంతో కాకతీయ మెడికల్ కళాశాలకు ప్రొఫెసర్ స్థాయి అధికారులు రావడంతో వైద్యవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా పలు విభాగాలు పనిచేయకుండా పోయే ప్రమాదం ఉందని జూనియర్ డాక్టర్స్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బదిలీలను పునఃపరిశీలించి, అధ్యాపకుల కొరత తీర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

వైద్యశాఖ బదిలీల్లో అక్రమాలు!

- ఆఫీస్ బేరర్ల పేరుతో ఉన్నచోటే తిష్ట
- లబోదిబోమంటున్న బదిలీ అయిన ఉద్యోగులు
- మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్





వరంగల్: వైద్యశాఖలో చేపట్టిన బదిలీల్లో అక్రమాలు జరిగాయంటూ బదిలీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. నాలుగేళ్లు ఒకేచోట పనిచేసిన ఉద్యోగులను క్యాడర్ వారీగా 40 శాతానికి మించకుండా బదిలీ చేయాలని, ఉద్యోగుల గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కోశాధికారి (ఆఫీసు బేరర్లు)లైతే వారి 6 సంవత్సరాల సీనియార్టీని పరిగణనలోకి మినహాయింపు ఇచ్చి బదిలీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. వరంగల్ జిల్లా పరిధిలో ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఉద్యోగులు వాపోతున్నారు. ఆఫీస్ బేరర్ అని తప్పుడు పత్రాలను సృష్టించి సీకేఎం ఆస్పత్రిలో ఫార్మసిస్టు గ్రేడ్–2గా 26 ఏళ్లుగా పనిచేస్తున్న ప్రకాశ్‌రావుకు బదిలీలో అదేస్థానంలో పోస్టింగ్ ఇచ్చారు. హనుమకొండ టీబీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న గ్రేడ్–2 ఫార్మసిస్టు మాధవి, పెగడపల్లిలో ఏడేళ్లుగా పనిచేస్తున్న ఫార్మసిస్టు శైలజ, కడిపికొండలో 6 సంవత్సరాలుగా పనిచేస్తున్న విజయలక్ష్మి, ధర్మసాగర్‌లో ఆరేళ్లుగా పనిచేస్తున్న శ్రీదేవి బదిలీ కాలేదని బదిలీ అయిన ఫార్మసిస్టులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫోకల్ నుంచి నాన్ ఫోకల్‌కు బదిలీ కావాల్సిన ఐదుగురు ఫార్మసిస్టులను ఫోకల్ స్థానాల్లోకి బదిలీ చేయడం వివాదాస్పదమైంది. ఎంజీఎం, కేఎంసీ, జీఎంహెచ్, కంటి ఆస్పత్రుల్లో సుదర్శన్ (7 సంవత్సరాలు), మోజొద్దీన్ (17 సంవత్సరాలు), లక్ష్మీప్రసాద్ (12 సంవత్సరాలు), వంశీధర్‌బాబు (12 సంవత్సరాలు), రవీందర్ (11 సంవత్సరాలు), గౌతం (11 సంవత్సరాలు), రవికుమార్ (11 సంవత్సరాలు), ఫాతిమా (6 సంవత్సరాలు), రియాజ్ (11 సంవత్సరాలు), రాకేశ్ ఖన్నా (6 సంవత్సరాలు), పి.రాజు (11 సంవత్సరాలు), బి.సుదర్శన్ (18 సంవత్సరాలు), సందీప్ (గీసుకొండలో 9 సంవత్సరాలు) ఫోకల్‌లో పనిచేస్తున్నారు. వీరు ఆఫీస్ బేరర్ల పేరుతో ఉన్న స్థానాల్లోకి బదిలీ అయ్యేందుకు పెద్ద మొత్తంలో ఆమ్యామ్యాలు సమర్పించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరందరికీ బదిలీలు జరిగినా ఉత్తర్వులు జారీ కాలేదు. ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో వస్తాయని అధికారులు చెప్పినట్లు బదిలీ అయిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సంపేటలోని ఒక పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఫార్మసిస్టు కొన్నేళ్లుగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డిప్యూటేషన్ పనిచేస్తూ ప్రస్తుత బదిలీల్లో కంటి ఆస్పత్రికి బదిలీ అయినట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్ల పేరుతో జరిగిన బదిలీల్లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టీఎన్‌జీవోస్ సంఘం నాయకుడు కలిసి చక్రం తిప్పినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆఫీస్ బేరర్లుగా సృష్టించిన పత్రాలపై విచారణ జరిపితే అక్రమాలు బహిర్గతమవుతాయని ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలను రద్దు చేసి మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించాలని వారు కోరుతున్నారు.

అన్నదాతలకు వంతెన కష్టాలు

- జేరిపోతుల వాగుపై బ్రిడ్జిలేక ఇబ్బందులు
- వానాకాలం అన్నదాతల నరకయాతన
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు



నీరుకుళ్ల- మైసంపల్లి గ్రామాల మధ్య జేరిపోతుల వాగుపై వంతెన నిర్మాణానికి సర్వే చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు(ఫైల్)

దుగ్గొండి: రెండు జిల్లాలు.. రెండు నియోజక వర్గాలు.. రెండు మండలాలు.. రెండు గ్రామాల మధ్య సమస్య ఇది. నీరుకుళ్ల, మైసంపల్లి గ్రామాలకు మధ్య జేరిపోతుల వాగుకు ఇరువైపులా రెండు గ్రామాల రైతుల భూములు ఉన్నాయి. నిత్యం రైతులు, కూలీలు ఈ దారి వెంట రాకపోకలు సాగిస్తోంటారు. కానీ, వర్షాకాలంలో ఆ దారి వెంట వెళ్లలేని పరిస్థితి. దీంతో వానాకాలంలో 22కిలోమీటర్లు తిరిగి పంటభూముల వద్దకు చేరాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు, ప్రజలకు వాపోతున్నారు. వాగు మీద బ్రిడ్జి నిర్మిస్తే ఇరుగ్రామాల ప్రజలకు, రైతులకు సౌకర్యంగా ఉంటుందని దశాబ్దాల నుంచి వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని మైసంపల్లి, హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామాల మధ్య 3.5కిలోమీటర్ల దూరం రహదారి ఉంటుంది. మధ్యలో జేరిపోతుల వాగు ప్రవహిస్తుంది. వాగు అవతల మైసంపల్లికి చెందిన 80మంది రైతుల 170ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇవతల నీరుకుళ్ల గ్రామానికి చెందిన 38మంది రైతులకు సంబంధించిన 77ఎకరాల భూమి ఉంది. ఇరు గ్రామాల రైతులు నిత్యం ఇదే దారి గుండా ప్రయాణిస్తూ సాగు పనులు చేసుకుంటున్నారు. ఏటా వర్షాకాలంలో మూడు నెలలు వీరు నరకం అనుభవిస్తున్నారు. వర్షం వచ్చి వాగు పొంగితే రాకపోకలకు అంతరాయం ఏర్పడి అవస్థలు పడుతున్నారు. తిరిగి రావాలంటే మహ్మద్‌గౌస్‌పల్లి, కటాక్షపూర్ మీదుగా 22కిలోమీటర్ల ప్రయాణం చేయాలి. దీంతో వ్యవసాయం చేయలేక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.

హామీలకే పరిమితం..

రెండు గ్రామాల మధ్య జేరిపోతుల వాగుపై వంతెన నిర్మాణం చేయాలని రెండు గ్రామాల ప్రజలు ప్రతిసారీ ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. వంతెన నిర్మిస్తామని హామీలు ఇచ్చిన నాయకులు గద్దెనెక్కగానే మరిచిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇదే వాగుపై తన నియోజకవర్గ పరిధి వరకు వాగుపై బ్రిడ్జిని నిర్మించారు. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో మరో బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. గత ఎమ్మెల్యే ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వాగుపై వంతెనతో పాటు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.4కోట్లు మంజూరయ్యాయని పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కానీ, ఆచరణలో చూపలేదు. ఈసారి ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వంతెనపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దొంతి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

వానాకాలం వస్తే ఇబ్బందే..



మాది దుగ్గొండి మండలం మైసంపల్లి. నాకు జేరిపోతుల వాగు అవతలి వైపు 5ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మిరప, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాను. వానాకాలం వచ్చిందంటే కష్టాలు తప్పడంలేదు. వాగు పొంగితే సాగు పనుల కోసం మైసంపల్లి నుంచి మహ్మద్‌గౌస్‌పల్లి, కటాక్షపూర్, మూలతాళ్లు, నీరుకుళ్ల మీదుగా పంట పొలానికి వెళ్లాల్సి ఉంటుంది. కూలీలను అంతదూరం తీసుకెళ్లాలంటే ఖర్చులు భరించలేకపోతున్నాం. పొడి వాతావరణం ఉందని కూలీలను వాగుదాటించి తీసుకెళ్తే వర్షం కురిస్తే ఇంటికి రావడం ఇబ్బందిగా ఉంటుంది. దీంతో కూలీలు పనులకు రావడానికి ససేమిరా అంటున్నారు. నీరుకుళ్ల రైతులదీ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా వాగుపై వంతెన నిర్మించాలి.

- గంగుల రవి, రైతు

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాళోజీ సెంటర్ : జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వరంగల్ నగరంలోని ఫాదర్ కోలంబో, ఎస్‌ఎన్ నగర్, బొంది వాగు, సంతోష్ మాత గుడి బ్యాక్ సైడ్, పోతన నగర్, దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏసీపీ నందిరామ్ నాయక్, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర రావు ఉన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



రోగి కేస్ షీట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ గోపాల్‌రావు

వర్ధన్నపేట: రోగులకు నాణ్యమైన సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు అన్నారు. ఆదివారం వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, వివిధ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించి, సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు పల్లె దవాఖాన వైద్యాధికారులతో సమన్వయ పరుచుకుని గర్భిణులకు 102 వాహనం ద్వారా ప్రభుత్వ దవాఖానలో చేర్పించి ఎలాంటి అసౌకర్యం లేకుండా నిరంతరం సేవలందించాలన్నారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గర్భిణీ వివరాలు నమోదు చేసి వారికి మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించి ధనుర్వాత టీకా, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రతి ఆశ కార్యకర్త ఇంటింటికి వెళ్లి చికిత్సలు అందించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ యాక్షన్ టీమ్‌ను ఏర్పాటుచేసుకుని అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీలో డాక్టర్ భరత్‌కుమార్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నర్సింగ్ ఆఫీసర్ వసుమతి, ఏఎన్‌ఎం పద్మ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


మహేందర్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ లోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రెండున్నరేళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ సదానందం ఇటీవల కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో ఆ రెండు కళాశాలలకు కూడా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ విశాల మహేందర్‌ను నియమించిన విషయం విదితమే. అయితే ప్రొఫెసర్ సదానందం ఆ బాధ్యతలనుంచి రిలీవ్ కాకుండా తన వ్యక్తిగత కారణాలతో జాప్యంచేస్తూ సెలవు పెట్టారు. చివరికి సదానందం ఆదివారం రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మహేందర్ బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు సదానందం ఈనెల 22న కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో విధుల్లో చేరబోతున్నారు. అలాగే కేయూ ఇంజనీరింగ్ విభాగాల డీన్‌గా మాత్రం సదానందం కొనసాగుతారు.

గంజాయి విక్రేత అరెస్ట్


అరెస్టు చూపుతున్న పోలీసులు

రామన్నపేట : వరంగల్‌లోని వెంకట్రామ జంక్షన్ వద్ద ఆదివారం ఇంతేజార్‌గంజ్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గంజాయితో వెళ్తున్న కాశిబుగ్గకు చెందిన శశిధర్‌ను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. కాశిబుగ్గకు చెందిన శశిధర్ మద్యానికి బానిసై గంజాయి విక్రయించేందుకు అలవాటు పడ్డాడు. అయితే అఫ్జల్ అనే వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని దాన్ని విక్రయించేందుకు వరంగల్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ వెంకట్రామ జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రూ.10,700 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలో ఎస్సై వెంకన్న, బి.రవీందర్‌రెడ్డి, శివకృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి


పట్టుబడిన పేకాటరాయుళ్లతో పోలీసులు

నెల్లికుదురు : మండలంలోని కాచికల్ శివారు ఆకేరు వాగు సమీపంలో గల ముత్యాలు ఇటుకల బట్టీల వద్ద ఆదివారం సాయంత్రం ఎస్సై సీహెచ్.రమేష్ బాబుతో పాటు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఇటుకల బట్టి వద్ద కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులతో వెళ్లి దాడి చేయగా చల్లా ముత్యాలు, వెంకన్న, నరేష్, బత్తుల కృష్ణ, గుంజె శ్రీను, తుర్క శ్రీను, బుజ్జి బాబు మరికొందరు పందెంకాసి పేకాట ఆడుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.17,700లతో పాటు పేక ముక్కలు, బైక్‌లు, కారును స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఏఎస్సై వెంకన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాహం..


కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజ్ వద్ద వరద ఉధృతి

- కాళేశ్వరం వద్ద 9.8 మీటర్ల ఎత్తులో ప్రవాహం
- అన్నారం వద్ద 16,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మేడిగడ్డకు 5,52,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాళేశ్వరం : మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది కాళేశ్వరం వద్ద పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో వరదలతో ప్రాణహిత నదికి భారీగా వరద నీరు రావడంతో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద కలుస్తుంది. దీంతో కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద 9.8 మీటర్లు ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద ప్రవాహం

మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజ్‌కు చేరుతుంది. అక్కడ 5,52,600 క్యూసెక్కు ఇన్‌ఫ్లో వరద ప్రవాహం చేరుతుంది. బ్యారేజ్‌లోని మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు.

గోదావరి వెలవెల..

గోదావరిలో వరద నీరు లేక వెలవెలబోతుంది. దీంతో ఎగువ మానేరు, ఇతర వాగుల నుంచి అన్నారం (సరస్వతీ) బ్యారేజ్‌కు ఇన్‌ఫ్లో 16,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ఇంజనీర్లు చెబుతున్నారు. వచ్చిన నీటిని వచ్చినట్లు మొత్తం 66గేట్లు ఎత్తి వరద నీటిని అవుట్‌ఫ్లో దిగువకు తరలిస్తున్నారు. అన్నారంలో నీరు లేక వెలవెలబోతుండగా, మేడిగడ్డలో నీటితో జలకళను సంతరించుకుందని స్థానికులు పేర్కొంటున్నారు.

అన్నారం సమీపంలోని చంద్రుపల్లి వాగుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుడడంతో రాకపోకలు నిలిచాయి. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

గోదావరికి జలకళ

- సమ్మక్క సాగర్‌లోకి చేరుతున్న వరద

కన్నాయిగూడెం : ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని తుపాకులగూడెం గ్రామ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఆదివారం గోదావరి ఉగ్రరూపం దాల్చింది. అయితే కొన్ని రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో పాటు మహారాష్ట్ర, తెలంగాణలోని బ్యారేజీల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదలడంతో సమ్మక్క బ్యారేజీలోకి నీరు భారీగా చేరింది. ఆదివారం ఉదయం 7,95,700 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 8,23,450 క్యూసెక్కులకు చేరింది. బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 82.2 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది.


సమ్మక్క బ్యారేజ్ వద్ద గోదావరి ప్రవాహం

గూడూరు: భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకులు



పరవళ్లు..

- జలపాతం వద్ద పర్యాటకుల సందడి


బయ్యారం: పెద్దగుట్ట వద్ద పర్యాటకుల సందడి

గూడూరు : మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలు.. ఆదివారం సెలవు రావడంతో నెక్కొండ, నర్సంపేట, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అడవిలోని భీమునిపాదం జలపాతాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకులు జలపాతం నీటిలో స్నానమాచరించి సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. విషయం తెలుసుకున్న గూడూరు ఎస్సై సీహెచ్. నగేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని జలపాతం ఉధృతి పెరుగుతోందని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి రాగా వారితో ఎస్సై జలపాతం వద్ద ఫొటో దిగారు.

పాండవుల జలపాతం వద్ద..


రేగొండ: పరవళ్లు తొక్కుతున్న జలపాతం

రేగొండ : మండలంలోని పాండవుల గుట్ట వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాండవుల గుట్టలోని జలపాతం పరవళ్లు తొక్కుతుంది.

బయ్యారం : బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం అందాలను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి ఆదివారం పర్యాటకులు తరలిరావడంతో సందడి నెలకొంది. జిల్లావాసులతో పాటు ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు చెందిన యువకులు అధికసంఖ్యలో జలపాతం వద్దకు చేరుకున్నారు. ఉదయం జలపాతం చూసేందుకు ఎలాంటి ఆంక్షలను పోలీసులు విధించకపోవటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించారు. అనంతరం పాండవుల జలపాతాన్ని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై ఉపేందర్ పరిశీలించారు. వర్షం కురుస్తున్నందున ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఎవరూ జలపాతం వద్దకు వెళ్లొద్దని హెచ్చరించారు.

వేర్వేరు కారణాలతో ఇరువురి ఆత్మహత్య

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ఇరువురు ఆత్మహత్య చేసుకున్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి శివారు చంద్రుతండాకు చెందిన ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి, ఖిలా వరంగల్‌కు చెందిన యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగుల మందుతాగి వృద్ధుడు..

మహబూబాబాద్ రూరల్ : పురుగుల మందుతాగి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి శివారు చంద్రుతండాలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుతండాకు చెందిన మాలోత్ హేమ్లా (85) భార్య ఈరమ్మ అనారోగ్యంతో మూడు రోజుల నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఏమైనా అయితే తనను ఎవరు చూస్తారనే మనస్తాపానికి గురైన హేమ్లా పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. హేమ్లా కుమారుడు బాలాజీ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో దూకి యువకుడు..

మామునూరు : మానసికంగా బాధపడుతున్న ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వ్యవసాయ బావిలో ఆదివారం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బొల్లికుంట గ్రామానికి చెందిన ఎర్ర వంశీ (24) బీటెక్ పూర్తి చేశాడు. అయితే మానసిక వ్యాధితో బాధపడుతూ వైద్యుల సూచనల ప్రకారం మందులు వాడుతున్నాడు. కాగా వంశీ రెండ్రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బొల్లికుంటకు వచ్చాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పని ఉందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతను రాత్రి అయిన ఇంటికి రాలేదు. దీంతో ఆదివారం ఉదయం తాడిపల్లి సతీష్ వ్యవసాయ బావిలో వంశీ శవమై కనిపించాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ వేణి తెలిపారు.

1098కి బాలల అప్పగింత

- చిన్నారులను పనికి తరలిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకున్న రైల్వే పోలీసులు

కాజీపేట రూరల్ : హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ముగ్గురు చిన్నారులను పనికి తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డి.సి.బెనర్జీ ఆదేశాలనుసారం యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ డ్రైవ్‌లో భాగంగా సీఐ సంజీవరావు, వరంగల్ జీఆర్పీ సీఐ జి.నగేష్, ఎస్సై ఐలయ్య, సత్యర్థి, మహబూబాబాద్ స్టాఫ్ శనివారం ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఖమ్మం నుంచి వరంగల్ వరకు డ్రైవ్ చేపట్టారు. అందులో భాగంగా ఒడిశాకు చెందిన ముగ్గురు చిన్నారులతో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా బాలలను కరీంనగర్‌లోని గ్రానైట్, మార్బుల్ కంపెనీల్లో పనికోసం తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో ఆ వ్యక్తిని వరంగల్ స్టేషన్‌లో దింపి జీఆర్పీ పోలీసులకు అప్పగించగా బాలలను 1098 చైల్డ్‌లైన్ వారికి అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రేమ జంటపై దాడి

- కుటుంబ సభ్యులపై కేసు నమోదు

శాయంపేట : ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటపై అమ్మాయి తల్లిదండ్రులు దాడి చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. హనుమకొండ పట్టణానికి చెందిన బైరి నిఖిల్ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన దానవేని మణిని ప్రేమించి ఈ నెల 16న చిల్పూర్ గుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రేమ జంట తమకు రక్షణ కల్పించాలని హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అమ్మాయి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. అయితే అమ్మాయి మేనమామ, సోదరుడు వారితో మాట్లాడగా తాను ప్రేమించిన అబ్బాయితోనే వెళ్తానని అమ్మాయి చెప్పినట్లు తెలిపారు. దీంతో ప్రేమ జంటను కలిపి పంపించి వేశారు. నిఖిల్ హనుమకొండలో ఉంటే సరికాదని తన అమ్మమ్మ ఊరు పత్తిపాకకు అమ్మాయిని తీసుకొని రాగా. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు ఆదివారం మధ్యాహ్నం నిఖిల్ వాళ్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లి ప్రేమ జంట పై దాడి చేసి అమ్మాయిని తీసుకుపోవడానికి ప్రయత్నం చేసినట్లు తెలిపారు. డయల్ –100కు ఫోన్ చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. జరిగిన సంఘటనపై బైరి నిఖిల్ ఫిర్యాదు మేరకు అమ్మాయి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి


సారయ్య మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కొలిపాక సారయ్య (56) మద్యానికి బానిసై స్థానిక మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సారయ్య నాయీబ్రాహ్మణ వృతి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ నెల 19న ఇంట్లోంచి వెళ్లిన సారయ్య తిరిగి రాలేదు. కాగా ఘన్‌పూర్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్ద ఆదివారం అతడు మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మద్యం మత్తులో వాటర్‌ట్యాంక్ వద్ద పడుకుని ఉంటాడని, నిద్రలోనే మృతిచెందాడని స్థానికులు భావిస్తున్నారు. కాగా మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గోడకూలి మహిళ ..

జనగామ రూరల్ : ప్రహరీ నిర్మిస్తుండగా పాత గోడ కూలి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వడ్లకొండకు చెందిన రేషన్ డీలర్ ఫౌల్ ఇంటి వద్ద శనివారం గుండె రమ (38), సంపంగి సాలయ్య పని చేస్తున్నారు. కాగా పని ప్రాంతంలో పక్కనే ఉన్న పాత గోడ కూలి ఇద్దరిపై పడింది. దీంతో రమకు తీవ్ర గాయాలు కాగా వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ నర్సింగ్ హోంకు తరలించి చికిత్స అందించారు. రమకు సీరియస్‌గా ఉండడంతో రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. రమ భర్త మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

జనగామ రూరల్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్ ఎదుట బస్టాండ్ సెంటర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేకుండా ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాలో తిరుగుతుండే వాడని, తనది నల్లగొండ ప్రాంతం అని చెప్పేవాడన్నారు. అతడి కుడిచేతిపై పుట్టుమచ్చ ఉందని గడ్డంతో ఉన్నాడని తెలిపారు. తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని 87126 85202, పీఎస్ నంబర్ 87126 85032 లలో సంప్రదించాలని సీఐ తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి మహిళ..


లచ్చమ్మ (ఫైల్)

వేలేరు(ధర్మసాగర్) : ధర్మసాగర్ మండలంలోని రాపాకపల్లి వడ్డెర కాలనీకి చెందిన బొంత లచ్చమ్మ (55) ఆదివారం తన వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. స్థానిక సీఐ మహేందర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

బిడ్డల కోసం బతకాలని ఉంది.!

- కాలేయ మార్పిడికి రూ.35 లక్షలు కావాలన్న వైద్యులు
- ఎదురైన వారందరిని ఆర్జిస్తున్న తల్లి కృష్ణవేణి
- దాతలు ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు

కన్నీటి గాథ


దాతల సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్న కృష్ణవేణి, ఆమె ఇద్దరు కూతుళ్లు

లింగాలఘణపురం : జీవితమంతా బాగానే సాగుతుంతోంది. సంతోషంగా గడుపుతున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా పిడుగులాంటి వార్త. తల్లికి జన్యుపరమైన లోపం ఏర్పడింది. కాలేయం మార్పిడి చేయాలనే వైద్యులు పేర్కొన్నారు. దీంతో ఆ కుటుంబాం దిక్కుతోచని స్థితిలో పడింది. 'నా బిడ్డల కోసం బతకాలని ఉంది.. కాపాడండి' అంటూ తల్లి కృష్ణవేణి.. ఆర్థిక సాయం కోసం దాతలు ప్రాదేయపడుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం పటేల్‌గూడేనికి చెందిన ఎడ్ల నర్సయ్య కూతురు కృష్ణవేణికి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన గంగదేవి నర్సింహతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సాత్విక, లతిక ఉన్నారు. నర్సింహ బతుకుదెరువు నిమిత్త వరంగల్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బీఈడీ, పీజీ పూర్తి చేసిన కృష్ణవేణి ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఇదే సమయంలో చిన్న కూతురు లతిక పుట్టిన సమయంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రికి వెళ్లగా మొదట థైరాయిడ్ అని..ఆపై కొలెస్ట్రాల్ అదుపులో ఉండడంలేదని..దీంతో గుండెకు స్టెంట్లు వేయాలని ఇలా అన్నీ వైద్య చికిత్సలు చేశారు. అయినా కొలెస్ట్రాల్ తగ్గకపోవడంతో చివరగా హైదరాబాద్ యశోద ఆసుపత్రికి వెళ్లగా కాలేయానికి సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. జన్యుపర లోపంతో కాలేయం చెడు కొలెస్ట్రాల్‌ను శరీరంలోనికి పంపిస్తుందని మార్పిడి చేయాలని, లేని పక్షంలో అనారోగ్యానికి గురై ప్రాణం పోయే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో కుటుంబీకులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. కాలేయ మార్పిడికి రూ.35 లక్షలు ఖర్చు అవుతుందని ఎస్టిమేట్ కూడా వేసి ఇచ్చారు. దీంతో ఆర్థిక సాయం కోసం ఆ కుటుంబం ఎదురైనవారందరినీ ఆర్జిస్తోంది. 'మా మేనత్త కాలేయం దానం చేసేందుకు సిద్ధంగా ఉంది. వైద్య పరీక్షలు చేస్తున్నారు.. నా ఇద్దరు ఆడపిల్లల కోసమైన బతకాలని ఉంది..ఆదుకోండంటూ' కృష్ణవేణి వేడుకుంటోంది.

దాతల సాయం కోసం వేయికళ్లలతో ఎదురు చూస్తోంది.
ఆపన్నహస్తం అందించే వారు 9010837688 (గంగదేవుల నర్సింహ) నంబర్‌కు గుగూల్, ఫోన్‌పే చేయాలని కోరుతోంది.

దాతలు దయ చూపండి..

- కిడ్నీ ఫెయిల్యూర్‌తో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి

నెల్లికుదురు : ప్రేమించి పెళ్లి చేసుకుంటే హాయిగా జీవితం గడపొచ్చని ఆమె కన్న కలలు కలలుగానే మిగిలిపోయాయి.. ప్రేమించిన పెళ్లి చేసుకున్న భర్త ఆడపిల్ల పుట్టిందని మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో బెంగటిల్లిన ఆమె మంచంపట్టి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ దాతల సాయం కోసం ఎదురు చూస్తుంది. వివరాలు.. మండలంలోని బంజర గ్రామానికి చెందిన గడ్డం వెంకటలక్ష్మికి తల్లిదండ్రులు నా అనే వారు ఎవరూ లేరు. దీంతో ఒంటరిగా ఉంటున్న ఆమె సింగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంది. వారి వైవాహిక జీవితంలో ఓ కూతురకు జన్మనిచ్చింది. ఆమెకు ప్రస్తుతం నాలుగు ఏళ్లు. కూతురుని బరువనుకున్నాడో ఏమో తెలియదు కాని ప్రేమించి పెళ్లి చేసుకుని కడదాక ఉంటానని ప్రమాణం చేసి ఆడబిడ్డకు జన్మనిచ్చిన తండ్రి వదిలేసి మధ్యలోనే వెళ్లిపోయాడు. చంటి బిడ్డను పోషించుకుంటూ భర్త వదిలేసిన భారంతో ఆమె మంచం పట్టింది. దీంతో జబర్దస్త్ నటుడు రాజమౌళి సహకారంతో ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వెంకటలక్ష్మికి రెండు కిడ్నీలు పాడైపోయాయని, శస్త్రచికిత్స చేసి కిడ్నీలు మారిస్తే తప్ప ఆమె బతకదని నిర్ధారించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి వైద్యఖర్చుల నిమిత్తం ఆపన్న హస్తం అందించే దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. కన్నబిడ్డ బతుకోసం తనను బతికించాలని ఆమె కన్నీటి పర్యంతం అవుతోంది.

సాయం చేసే వారు 99086 53374 నంబర్‌కు నగదు అందించి ఆదుకోవాలని ఆమె వేడుకుంటుంది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ..


తార(ఫైల్)

పర్వతగిరి : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని బోటికాడితండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని బోటికాడి తండాకు చెందిన భూక్య తార(34) శనివారం రాత్రి పురుగుల మందు తాగి, అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి అన్న ధరావత్ భాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

హత్య చేశారని ఆందోళన..

కాగా తారను ఆమె బావ భూక్య బాలాజీ శ్వాస ఆడకుండా దిండుపెట్టి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంగెం, పర్వతగిరి ఎస్సైల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. గతంలో భూక్య శ్రీను అలియాస్ చిరంజీవిని సైతం నెక్కొండ మండల కేంద్రంలో హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని బంధువులు ఆరోపించారు. భూక్య తార కుమారుడు భరత్ తెలిపిన వివరాల ప్రకారం .. తన తండ్రిని గతంలో హత్య చేశారని, తన తల్లిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని, తనను చంపుతానని బెదిరించినట్లు తెలిపాడు. అయితే భూక్య శ్రీ నివాస్ మృతితో భార్య తార తనపేరుమీద మూడెకరాల పట్టా చేయించుకుంది. బ్యాంకులో రుణం తీసుకోగా కుమారుడు భరత్, ఇంటి నిర్మాణ అవసరాల కోసం రూ.8లక్షల అప్పు చేసింది. 20 గుంటలు భూమి అమ్మేందుకు ప్రయత్నాలు చేయగా బావ బాలాజీ నిరాకరించాడు. దీంతో శనివారం చోటు చేసుకున్న పరిణామాల మధ్య తారది హత్య.. ఆత్మహత్య అనేది వెలుగులోకి రానుంది.

నేటినుంచి శిక్షా సప్తాహ ఉత్సవాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ ఉత్సవాలను నేటినుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జాతీయ విద్యావిధానం–2020 (ఎన్ఈపీ) అమల్లోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నందున ఈ ఉత్సవాలను నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పాఠశాలల్లో శిక్షా సప్తాహ కార్యక్రమాలను నిర్వహించాలని డీఈఓ డి.వాసంతి రెండు జిల్లాల హెచ్‌ఎంలను ఆదేశించారు. పీఎస్,యూపీఎస్,హైస్కూల్స్‌లో విద్యార్థుల స్థాయి బట్టి కార్యక్రమాలను నిర్వహించాల్సింటుంది.

వారంరోజులు..రోజుకు ఒకగంట..

వారం రోజులు.. రోజుకు గంట పాటు పాఠశాలల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ షెడ్యూల్ రిలీజ్ చేసింది. విద్యార్థుల బోధనకు ఎలాంటి ఆటంకం లేకుండా ఒక పీరియడ్ ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సమయాన్ని కేటాయించి విద్యార్థులను, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని ఆదేశించింది. ఈ కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత యాప్‌లో హెచ్‌ఎంలు జిల్లాల గ్రూపుల్లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జిల్లా విద్యాశాఖాధికారులు వాటిన క్రోడీకరించి కేంద్రం నిర్ధారించిన గూగుల్ లింకులో అప్‌లోడ్ చేస్తారు. తొలిరోజు పాఠశాలల్లో బోధనోపకరణాల దినోత్సవంగా (టీఎల్ఎండీ)నిర్వహించాల్సింటుంది. 23న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు చర్చ పద్ధతిలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాలు నిర్వహించాలి. 24న క్రీడా దినోత్సవం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న డిజిటల్ నైపుణ్యాలపై, 27న పర్యావరణ పోషకాహార దినోత్సవం, 29న సమాజ భాగస్వామ్య దినోత్సవ కార్యక్రమం చేపట్టాలి.